

# జామిమొక్క

గోవిందరాజు శ్రీనివాసమూర్తి

మరీ మరీ ఆలోచించి ఆ వాటాలో దిగాడు శంకరం. తను ఉండే ఇల్లు తనకు అనుగుణంగా ఉండాలని అతడి పట్టుదల. ఇళ్ళు వెదికిన కొద్దీ నిరుత్సాహం ఎక్కువైంది కాని, తన కోరిక తీరలేదు. చిన్న ఉద్యోగంతో అద్దె వివరీతంగా వెదజల్లే తాహతు తనకు లేదు. ఇవ్వగలిగిన అద్దెలో అన్ని సౌకర్యాలూ ఉన్న వాటా దొరకాలని అతడి పట్టుదల. ఇరవై గదులూ, ముప్పై బాత్‌రూంలూ అతడి కక్కరలేదు. రెండే రెండు గదులూ, చిన్న వంట గదీ—అదీ అతడికి కావల్సింది. వేసంగి కాలంలో కాస్త గాలి పీల్చుకునేందుకు ముందు చిన్న ఖాళీ స్థలం ఉంటే ఇహ చెప్పనక్కరలేదు—ఈ నమూనా యిల్లు హైదరాబాదులో దొరకాలంటే యజ్ఞం చేయాలని అనుభవం మీద తెలుసుకున్నాడు శంకరం. ఇంటి నుంచి హోరాహోరీగా ఉత్తరాలు వస్తున్నై! "ఇల్లు దొరికిందా?—ఇక్కడ నాకేం తోచటం లేదూ." అని. అసలు హైదరాబాదులో ఉద్యోగం పడిందంటేనే శంకరం గుండెల్లో బాంబు పడింది. 'మనలాంటి బుల్లి సంసారాలకి బొంబాయంకే పోయి, ఇక్కడ కొచ్చి ఏం బావుకోనూ' అని పదే పదే నాలుక కరుచుకున్నాడు శంకరం. ఈ మహాపట్నంలో తన కొచ్చే రెండువందల యాభైతో సంసారాన్ని ఎలా లాగాలో తలుచుకుంటే అతడి గుండె బావురుమంటుంది. అందులో కనీసం డెబ్బై అయిదు అన్నా పెడితేగాని తాడూ బొంగరం ఉన్న ఇల్లు దొరకదు. 'ఛీ, వెధవ ఉద్యోగం." అని అతికష్టం మీద సంపాదించుకున్న ఉద్యోగాన్ని కూడా తిట్టుకున్నాడు.

ఉద్యోగం మీది విరక్తి కన్నా అద్దెకు డెబ్బై అయిదు ఇవ్వవలసి రావటం అతడికి మరీ బాధగా ఉన్నది. "భగవంతుడా, అద్దె కొంపలు ఎందుకు సృష్టించావయ్యా!— తలకొక ఇల్లు కట్టించి ఇవ్వలేకపోయావటయ్యా, నీ సృష్టి బంగారం కానూ." అని లోలోనే ఘనతారంగా తిట్టుకున్నాడు.

ఏమయితేనేం, ఇన్నాళ్ళు చూపిన ఓపికకు ఇప్పుడు దొరికిన ఇల్లు కొంచెం ఆనందాన్ని కలిగించింది శంకరానికి. ముచ్చటుగా రెండే గదులు. సపరేట్ బాత్‌రూమ్. ప్రతిగదిలో తలుపులున్న అల్మారాలు. ముందు గదికి రెండు కిటికీలు—వంట గదిలో వంట చేసుకునేందుకు గట్టు. పక్కనే కొళాయి. పక్క వాటాలో ఇంటివాళ్ళు. ఎవ్వరి సరిగ్గా అంతే వాటా!

కాని ఒక్కటే చిక్కు— ఇంటి చుట్టూతా భరించలేనంత ఖాళీ స్థలం. సుమారు రెండు వేల గజాల పైనే ఉండవచ్చు. అంత స్థలానికి చుట్టూతా కాంపౌండ్ వాల్. అందులో ఎవరో విసిరేసినట్టు ఒక మూలగా ఇల్లు— ఈ ఉద్దేశం శంకరానికి మొదట్లో అర్థం కాలేదు. ఇంటివాళ్ళని అడిగాడు. "ఇంత స్థలం పెట్టుకుని ఓ మూలగా ఇల్లు కట్టారేమిటండీ"ని. దానికి ఇంటాయన "ఆ! ఏముంది— ఇల్లు నా సొంతం, స్థలం మా తాత ముత్తాత లిచ్చింది. నిదానంగా స్థలం బాగుంటే మరో రెండు ఇళ్ళు వేద్దామని." అన్నాడు. ఆయనకు మళ్ళీ కొడుకులు. "మళ్ళీ లక్ష మాటలు." అన్నాడు శంకరం. ఆయన నవ్వి ఊరుకున్నారు.

ఇల్లు దొరికింది, బయలుదేరి వచ్చేయమని రాశాడు శంకరం. గిలిబిలి మంటూ నాలుగో రోజు వచ్చి వాలింది శ్రీమతి శాంత— ఆరేళ్ళ పిల్ల ఇందుతో సహా. ఇల్లంతా ఓమారు కలియ చూసి "అంతా బాగానే ఉన్నది కాని, ఇంత ఖాళీ స్థలాన్ని చూస్తే భయం వేస్తున్నది బాబూ, దుబ్బులా గడ్డి పెరిగి వికారం వేస్తోంది." అన్నది శాంత.

'ఇదేం, మన సొంతమా?' అన్నాడు శంకరం.

'కాకపోతే మటుకూ, ఇంత నాగరికతా శ్రద్ధ ఉండక్కర్లా!' అని సాగదీసింది.

'మనకెందుకులే పోనూ.' అన్నాడు.

కాని ఆ సాయంత్రమే ఇంటావిడ్ని అడిగింది శాంత "పిన్నిగారూ, దొడ్డి అంతా బాగు చేయించి పూలమొక్కలో, కాయగూరలో వేయకపోయారా!" అని

"ఆ, ఆ ఓపిక ఎవరికి ఉన్నదమ్మా—ముసలి దద్దులా, ఇంటి పనితోనే సరిపోతుంది." అన్నది ఇంటావిడ.

ఆరాత్రి శంకరంతో శాంత అన్నది. 'వాళ్ళకి ఓపిక లేకపోతే సరేసరి, మనమన్నా కాస్త బాగు చేయించుకుందామ'ని

శంకరానికి కూడా ఈ విషయంలో ఆసక్తి ఉన్నది. పూలమొక్కలతో నిండి ఉన్న పూరి కొంపయినా అందంతో కిలకిలలాడుతుందని అతడి అభిప్రాయం. ఇంత దొడ్డి చాతకాక అలా వదిలేయటం

# జామి మొక్క

రోజుకు పది పన్నెండు కాయలు స్వయంగా కోసేది ఇందు. ఇది నీకూ, ఇది నీకూ అంటూ తలకొకటి ఇచ్చేది. అలా ఇస్తున్నప్పుడు ఆ పిల్ల ఆనందం వర్ణనాతీతం. శాంత మనస్సు కూడ ఉవ్వెత్తున లేచి ఆనందంతో ఊగిసలాడేది. శంకరం కూడ ఆ ఆనందం పంచుకుంటున్నాడు.

ఒకరోజు పొద్దుట జామి చెట్టును చూసి బావురుమంది ఇందు. గోడ వైపు కొమ్మన నిన్న మిలమిల లాడిన కాయల్లో ఒక్కటి కూడలేదు. శాంతతో ఈ సంగతి చెప్పింది. శాంత కూడ గబగబ వచ్చి చూసింది. అన్నికాయలు ఎవరు కోశారో అర్థం కాలేదు. శంకరం ఈ సంగతి విని "ఎవరో రౌడీ వెధవలు" అని చిన్న తిట్టుతో చాలించాడు. శాంత ఇంటావిడతో కూడ ఈ విషయం చెప్పింది. "ఏమోనమ్మా, బజారు వెధవలు—గోడ మీదకు కొమ్మ ఉందేమో—ఏ రాత్రో కోసేసుంటారు." అన్నది ఇంటావిడ.

ఇందుకు కళ్ళంట నీళ్ళు తిరిగినై—కాని చేయ కలిగింది లేదు. ఇవతలి వైపు చెట్టు నిండా కాయలు ఉన్నాయి కదా' అని తృప్తిపడింది.

సాయంత్రం ఇంటాయన ఇందుని పిలిచినప్పుడు ఆయనతో కాయలు ఎవరో కోసేసిన సంగతి చెప్పింది ఇందు. ఆయన కూడ బాధ పడ్డాడు. "ఇప్పుడు కాయలు అయినై, రేపు ఇంట్లో వస్తువైనా ఇంతేగా." అని తిట్టి, "పోన్లే, రెండురోజుల్లో మళ్ళీ కాయవూ." అని ఇందుని ఓదార్చాడు. ఇక ఆడుకునేందుకు వెళ్ళింది ఇందు.

దూరంగా ఇంటివాళ్ళ పెద్దబ్బాయి ఓజామ కాయ తన స్నేహితుడి కెవడికో ఇవ్వటం చూసింది ఇందు. గబగబ అతడి దగ్గరకు వెళ్ళి "అదెక్కడిదీ?" అని అడిగింది. "నిన్న నువ్వే ఇచ్చావుగా." అన్నాడు ఆ కుర్రవాడు.

"నిన్న నా ముందే అది తినేశావుగా." అంది ఇందు.

"నువ్వు రెండు ఇచ్చావుగా." అన్నాడు ఆ కుర్రవాడు.

"కాదు ఒకటే ఇచ్చాను."

"కాదు, రెండు."

"అంతా ఉత్తిది. దొంగ మాటలు. నువ్వే కాయలన్నీ కోశావు." అన్నది ఇందు.

"నా యిష్టం, ఫో." అన్నాడు కుర్రవాడు అని ఇందు జడ పుచ్చుకుని లాగాడు—ఇందు భోరున ఏడుస్తూ ఇంటికి వచ్చింది.

"నిన్న ఆ అబ్బాయి కాయలన్నీ తెంచేశాడు." అని శాంతతో చెప్పింది ఇందు.

"ఏ అబ్బాయి?" అన్నది శాంత.

"అదే, వాడే, రాము."

"ఛ, తప్పమ్మా. అలా అనకూడదు. రాము అలాంటి వాడు కాదు." అన్నది శాంత.

"కాదు నిజంగా వాడే కోశేశాడు." అన్నది ఇందు.

"నిజంగా?" అన్నది శాంత.

ఇంటావిడ ఇది విన్నది. చరచర ఇవతలికి వచ్చి "వాడెందుకు కోస్తాడమ్మా, కావాలంటే రాజాలా నిన్నే అడిగి కోసుకుంటాడు." అన్నది.

"నిజంగా వాడే కోశాడు, కావలిస్తే పిలిచి అడగండి." అన్నది ఇందు.

"సరే, కోస్తే కోశాడు— ఏమంటావే అయితే." అన్నది ఇంటావిడ విసురుగా.

శాంత మనస్సు చివుక్కుమన్నది.

"అదేమిటండీ పిన్నిగారూ, పిల్లది, దాని గోడు అది చెప్పుకుంటున్నది. రెండు మంచి మాటలు చెబితే అదే ఊరుకుంటుందిగా." అన్నది శాంత.

"మంచిమాటలు చెప్పేందుకు నాకేం పట్టిందమ్మా. అక్కడికి, నా కొడుకు ఓ దొంగవెధవైనట్టు చెప్పుకొస్తున్నది."

"ఆ పిల్ల కేం తెలుసు చెప్పండి పిన్నిగారూ." అన్నది శాంత.

"తెలియకపోతే, పెద్దదానివి, నువ్వు తెలియ చెప్పాలమ్మా." అన్నది ఇంటావిడ.

చిలికి చిలికి గాలివాన అయింది.

ఆ రాత్రి శంకరానికి పక్క వాటాలోంచి, స్పష్టంగా మాటలు వినిపిస్తూనై.

రెండో కుర్రవాడు కాబోలు "రామే కాయలు కోసి అలమారులో దాచాడు." అన్నాడు. "ఛప్, భడవా నోర్ముయ్" అని తల్లి కసిరింది. "వాడిష్టం, వాడు కోస్తాడు, ఏం కోస్తే, ఈ ఇల్లు వాడిది—చెట్టు వాళ్ళ సొంతమా—అసలు గదులైతే అద్దెకిచ్చాం కాని, దొడ్డంతా అద్దె కిచ్చామా?" అంటున్నది ఇంటావిడ.

"మొక్కని వాళ్ళు పెంచారు కదే." అన్నాడు ఇంటాయన.

"సరే, మీ తీర్పు బాగానే ఉన్నది. మీ తీర్పెవరూ అడగలేదు. అసలు వాళ్ళని మొక్కలు నాటమని ఎవరన్నారు? వీళ్ళు నాటకపోయినా అది మొలిచేదే అసలు వీళ్లెవరు— ఇవాళ కాకపోతే రేపు వెళ్ళిపోయేవారు." ఇలా దూకుడుగా మాటలు వినిపిస్తూనై.

డాక్టర్ కబుర్లు

## ఎండలో నీటి అవసరం!

ఎండ ఎక్కువగాఉంటే చెమట ఎక్కువ పడుతుందని వేరే చెప్ప నక్కరలేదు! ఈచెమట ఎక్కువ అవటం చేత దేహానికి కావలిసినంత నీరులేకపోతే మూత్రంలో ఉప్పులు



అధికం అయి అవి మూత్రపిండాలలో 'రాళ్లు'గా ఘనీభవించవచ్చు.

చీమ తలఅంత ఉప్పుగడ్డ కూడా వంటిలోని సున్నితమయిన చర్మం లోపలిభాగాలకి ఎంతోబాధకలిగించవచ్చు. ఇదే పెద్దరాయి అయితే అంత పెద్దబాధ లేకపోవచ్చు. ఇటువంటి రాళ్ళు మూత్రధారకి అడ్డు రాకపోతే అసలే బాధ ఉండక పోవచ్చు.

మూత్రంలో కాల్షియం అధికం అయితే రాళ్ళు ఏర్పడటానికి అవకాశం ఉంది. ఎంతోకాలం మంచం పడితే (జబ్బువల్లకాని ఎముకలు విరగటంవల్లకాని), అధికంగా 'డి' వైటమిన్ తింటే ఈ ఇబ్బంది కలగవచ్చు.

ఏది ఎలా ఉన్నా ఎండగా ఉన్న పూడు మంచినీరు బాగా తాగటం మంచిది.

హెచ్. ఎల్. హెర్సెన్‌సోన్
(కాపీరయిటు)

పక్క మీద పడుకుని ఉన్న శంకరానికి వాతి తోచింది. ఒక చిన్న మొక్క ఇలాంటి అవాంతరాలకు దారి తీసినందుకు అతడు చాల బాధపడ్డాడు. వస్తుతః అతడు పేచీలకు దిగే వ్యక్తి కాదు. బాధను దిగమింగే అలవాటు అతడికి మొదటి నుంచీ ఉన్నది.

"చూశారా, ఆ మాటలు. సాయంత్రం నుంచీ ఇదే వరస. నేను చెబితే మీరు నమ్మలేదు." అన్నది శాంతి.

"సరే మాట్లాడక పడుకో— కోస్తే కోశారు." అన్నాడు శంకరం.

మర్రోజు పొద్దుట పిల్లడికి నీళ్ళు పోస్తున్నప్పుడు ఆ చాయలకు రాలేదు ఇంటావిడ. ఆ సాయంత్రం శంకరం సినిమాకు వెళ్ళి కాస్త ఆలస్యంగా ఇంటికి వస్తే బయట గేటుకు తాళం వేసి ఉన్నది. అరగంట కేకలు వేయగా ఇంటావిడ విసుక్కుంటూ వచ్చి తాళం తీసి ఏదో గొణుగుతూ వెళ్ళింది. మర్రోజు నుంచీ కరెంటు ఎక్కువ కాలుస్తున్నారని తొమ్మిది గంటలకే మెయిన్ స్విచ్ తీసేయటం మొదలెట్టింది. ఒకరోజు ఇందు వాళ్ళింట్లో అల్లరి చేసిందని చెవి మెలిపెట్టింది ఇంటావిడ. భోరున ఏడుస్తూ వచ్చింది ఇందు. ఇవన్నీ శంకరానికి భరించరానివయ్యాయి.

అన్నిటి కన్న భరించరానిది ఆ సాయంత్రమే చూశాడు శంకరం. ఇంటావిడ ఓ సంచీ తీసుకు వచ్చి రాముని గోడ మీదకు ఎక్కించి జామ కాయలన్నీ కోయించి సంచీలో వేసుకొంది!

ఈ దృశ్యం శాంతను క్షోభ పెట్టింది.

ఇందు చిన్నమనస్సు తల్లడిల్లిపోయింది. "కొయ్యకండి మామ్మగారూ, కొయ్యకండి మామ్మగారూ." అని ఆమెను ప్రాధేయపడింది. కాని చూస్తూండగానే చెట్టంతా ఖాళీ అయిపోయింది.

ఆ రాత్రి ఇందుకు వళ్ళు పేలిపోయే జ్వరం వచ్చింది!—

శంకరం కాలు కాలిన పిల్లిలా అటూ ఇటూ తారట్లాడాడు. అతడి బుర్రలో అగ్నిపర్వతాలు బద్దలౌతున్నట్టు కాలిపోయాడు. భోజనం చేయకుండానే అతడు పడుకున్నాడు.

తెల్లారి కట్టే ఐదారు రిక్షాలను పిలుచుకు వచ్చి సామానంతా వాటిల్లోకి చేర్పించాడు శంకరం. జ్వరంతో ఉన్న ఇందును కూడ రిక్షాలో కూచోపెట్టి, ఇంటివారిని లేపి వారికివ్వవలసిన అద్దె ఇచ్చేసి వారు చూస్తూండగానే తన స్నేహితుడి ఇంటి కేసి బయలుదేరాడు శంకరం.

రిక్షాలలో వెడుతూన్న వారిని చూసేందుకు గోడ వైపుకు వచ్చిన ఇంటావిడకు జామిచెట్టు మొదలంటా నరుకబడి కిందపడి ఉన్న దృశ్యం కనుపించి కళ్ళు చీకట్లు కమ్మినై.... ●

ఆంధ్ర సచిత్ర వార పత్రిక

## వనితాలోకం వ్యాసరచన పోటీ

**మొదటి బహుమతి రు. 200**

**రెండవ బహుమతి రు. 150**

**మూడవ బహుమతి రు. 100**

**ఇంకా రు. 50 చొప్పున అయిదు ప్రత్యేకమయిన కన్సొలేషన్ బహుమతులు!**

# 'నేడు వనితాలోకం ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య ఏమిటి?'

సాంఘికంగా, ఆర్థికంగా, సాంకేతికంగా మనదేశంలో ఎన్నో మార్పులు జరుగుతున్నాయి. వాటివల్ల పాత సమస్యలు కొన్ని పరిష్కారం అవుతున్నాయి, కొత్తవి తయారవుతున్నాయి! అయితే 'నేడు వనితాలోకం ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య' ఏమిటో వనితలే చెప్పగలరు అందుచేతనే సంక్రాంతి సందర్భంలో ఒక వనితాలోకం వ్యాసరచన పోటీ నెలకొల్పుతున్నాము. రచయిత్రులందరూ సహకరించి 'నేడు వనితాలోకం ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య'ని చర్చించే వ్యాసాలు పోటీకి పంపి వనితాలోకం వ్యాసరచన పోటీని జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

### నిబంధనలు

1. వ్యాసాలు స్వంతవయి ఉండాలి. అనుకరణలుకాని, అనువాదాలు కాని కాకూడదు. వ్యాసాలు తమ స్వంత రచనలేననీ, అనుకరణలుకాని, అనువాదాలుకాని కావని రచయిత్రులు తమ రచనలతోబాటు హామీ రాసి పంపాలి.
2. వ్యాసం మూడు అరఠావు పేజీలనిమించి ఉండరాదు. (ఒక అరఠావు పేజీ ఒక ఎక్సర్సయిజు నోట్‌బుక్ పేజీకి రెండు రెట్లు.)
3. కాగితానికి ఒక వయిపునే సిరాతో రాయాలి.
4. వ్రాత ప్రతులు ఎట్టి పరిస్థితులలోనూ తిప్పి పంపబడవు. (అందుచేత రచయిత్రులు తపాలా బిళ్లలు, స్వంత చిరునామాకల కవర్లు పంపరాదు.)
5. వ్రాత ప్రతిమీద రచయిత్రి పూర్తి పేరు, చిరునామా తెలుగు లిపిలో రాసి ఉండాలి. (చిన్న కాగితాలమీద విడిగా రాసి వ్రాత ప్రతితో జతపరచరాదు.)
6. కవరుమీద 'వనితాలోకం పోటీకి' అని స్పష్టంగా రాయాలి. వ్యాసాలు 'సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టివీధి, మద్రాసు—1' కి పంపాలి.
7. <u>పోటీ ముగింపు తేదీ జనవరి 31, 1969. వ్రాతప్రతులు ఆ తేదీకి ముందుగా కాని, ఆ తేదీనగాని మా కార్యాలయం చేరాలి.</u>
8. పోటీ తుది నిర్ణయం సంపాదకునిదే. ఈ విషయమయి ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరుపబడవు.
9. పోటీ ఫలితాలు ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఉగాది ప్రత్యేక సంచికలో ప్రచురించబడుతాయి.
10. ఈ పోటీలో వనితలు మాత్రమే పాల్గొనవచ్చు.

సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక.